

యవ్వనమంతా విషయవాంఛల్లో గడిపిన భోగి నడివయస్సులో తన దృష్టి భగవంతుడిమీదికి మళ్ళించి భక్తుడైనాడు. భక్ష్యభోజ్యపానీయాలూ, స్త్రీలూ ఆనందంలో కొత్త అనుభవం ఇచ్చే ఆశ తీరిపోగానే భోగి భక్తుడుగా పరిణమించాడు.

ఐహిక సుఖాలు తన నింకా ఏమాత్రమో ఆకర్షిస్తూ ఉండటం గ్రహించి భక్తుడు వాటిని తీవ్రంగా నిరసించసాగాడు.

భక్తిలో ఆతనికి నిజమైన ఆనందం కనిపించక కాదు. కనిపించింది, అపారంగా కనిపించింది.

నువ్వుల్లోంచి వచ్చే నూనెకు అంతున్నది. ఇసుకలోనుంచి వచ్చే తైలానికి అంతేలేదు. కవిగా డన్నట్టు వినపడే సంగీతం మధురంగా ఉంటుంది; వినిపించనిసంగీతంమధురతరంగాఉంటుంది.

బయటినించి లోపలికి పొయ్యే ఆనందానికి మేర ఉంటుంది; లోపలినుంచి బయటికొచ్చే ఆనందానికి మేర లేదు.

రైతులు సేద్యం చేస్తున్నారు, రాళ్ళవాళ్ళు రాళ్ళు పగల గొట్టుతున్నారు, సాలెవాళ్ళు బట్టలు నేస్తున్నారు, పాకీవాళ్ళు రోడ్లు చిమ్ముతున్నారు, ఆడవాళ్ళు పిల్లల్ని కంటున్నారు. భోగిమాత్రం భక్తుడైనాడు.

ఇతర ప్రపంచం తుచ్ఛ జీవితంలో, శ్లేష్మంలో ఈగలాగా, పడి కొట్టుకుంటుంటే భక్తుడు ఆత్మసంతృప్తి చెందగలిగాడు.

కాని భక్తుడికి భక్తివల్ల కలిగే ఆనందం చాలలేదు. మొదట ఏకైకత్వంగా కనిపించినది. రానురాను ఏకాకిత్వంగా కనిపించ సాగింది.

*కొడవటిగంటి కుటుంబరావు*

అందుకని భక్తుడు భక్తిప్రచారం ప్రారంభించాడు.

"ఈతుచ్ఛ సుఖాల్లో పడి ఎంతకాలం కొట్టుకుంటారు ? వీటిని విసర్జించండి ! తారకమైన హరిపదసేవ చెయ్యండి! ఈ సుఖాలు హరినామకీర్తనకు సాటి రావు ! ఇవి మిమ్మల్ని ఉద్ధరించలేవు !" అని ప్రచారం చెయ్యసాగాడు భక్తుడు.

భక్తుడి భక్తిపారవశ్యం అందరినీ ఆకర్షించింది, అందరినీ నమ్మించింది.

విషయలంపటులైన వారంతా భక్తుణ్ణి చూసి ఒక నిట్టూర్పు విడిచారు. "ఆహా ! ఎంతధన్యుడు ! ఇంద్రియవాంఛలను ఎట్లా జయించాడు ? మనబోటి మానవమాత్రులకు ఆ విరక్తి సాధ్యం కాదు కద ! ఆయనతో పోలిస్తే మనం ఎంత పశుతుల్యులం !" అనుకున్నారు వారు. ఈ ఆత్మ విమర్శతో పవిత్రాత్ములైనవారై, తమఆత్మలను తిరిగి మకిలపరచుకోవటం కోసం విషయవాంఛలవంక తిరిగారు– నీళ్ళలో పరిశుభ్రమై వచ్చిన కుక్క ఆనందంగా రోడ్డుమీద పొర్లినట్టు.

"ఈతుచ్ఛసుఖాల్లో పడి ఎంతకాలం కొట్టుకుంటారు ? వీటిని విసర్జించండి ! తారకమైన హరిపదసేవ చెయ్యండి ! ఈ సుఖాలు హరినామ కీర్తనకు సాటిరావు ! ఇవి మిమ్మల్ని ఉద్ధరించలేవు !" అని ఉద్బోధించటం మానలేదు భక్తుడు.

ఈ మాటలువిని విద్యాధికులూ, సంస్కారులూ రసగ్రహణంచేసి వెళ్ళిపోయినారు. కాని విద్యాహీనులకు భక్తుడి మాటల్లో ఒకపిలుపూ, ఒక ఉద్బోధమూ ఒక ఆజ్ఞా వినిపించినై.

రైతు నాగలి వదలి పెట్టాడు రాళ్ళవాడు సుత్తె అవతల పారేశాడు సాలెవాడు మగ్గం ముందునించి లేచాడు పాకీవాడు చీపురు వదిలేశాడు. అందరూ భక్తుడిచుట్టూచేరి భజన చెయ్యసాగారు

ఆడదిమాత్రం పురిటి కెదురుచూస్తూ ఉండి పోవలసి వచ్చింది.

పొలం దున్నటంలో ఉన్న సుఖమూ రాళ్ళు పగలగొట్టటంలో ఉన్న సుఖమూ రోజల్లా మగ్గంనెయ్యటంలో ఉన్న తృప్తీ రోడ్లూడవటంలో ఉన్న పారవశ్యమూ వదులుకుని భక్తులంతా తనచుట్టూమూగినందుకు భక్తుడు సంతోషించాడు

"ఇవి మిమ్మల్ని ఉద్ధరించలేవు ! అన్న సత్యాన్ని తమకు తెలియజేసినందుకు రైతూ, రాళ్ళుకొట్టేవాడూ సాలెవాడూ, పాకీవాడూ సంతోషించారు వారు చదువుకున్నవారైతే ఆ విషయం వారి కదివరకే తెలిసి వుండును.

ఇతర భక్తుల్ని తన శిష్యుల్ని చేసుకుని భక్తుడు భక్తాగ్రేసరు డయినాడు

ఆయనకూ, ఆయన భక్తులకూ ఎక్కడికి వెళ్ళినా గొప్ప సత్కారం జరుగుతున్నది.

ఆయన ఖ్యాతి నలుదిక్కులా వ్యాపించింది.

కర్మపరిపాకం చాలక ఇంకా తమ వృత్తుల లోనే ఉంటున్న రైతు, కంసాలి, సాలె, పాకీజనం మూలంగా భక్తాగ్రేసరుడి జీవితానికీ, భక్తుల జీవితానికీ ఏ విధమైన కొదువా లేకపోయింది.

తమ వృత్తులను విడిచిపెట్టి హరిపద ధ్యానం అవలంబించిన వారికి జీవితం ఇప్పుడు సుఖమయంగా ఉంది.

ఈ సంగతి గమనించి ఇతరులుకూడా ఈ భక్తమతంలో చేరడానికి తండోప తండాలుగా వచ్చి భక్తాగ్రేసరుణ్ణి ఆశ్రయించ సాగారు.

భూస్వాముల పొలాలు పాడుపడినై. పెట్టుబడిదార్ల పరిశ్రమలు మూలబడినై.

"ఇది దారుణంగా ఉంది. ఇట్లా అయితే జరగదు" అన్నారు పెద్దలు.

"ఈ పాములకి మనం చేజేతులా పాలుపోసి పెంచాం" అన్నారు పెద్దలు.

"వీటిని మారణహోమం చెయ్యక పోతే ప్రపంచం తలక్రిందై పోతుంది!" అన్నారు పెద్దలు.

"ఈ భక్తాగ్రేసరుడు మారువేషంతో తిరుగుతున్న విప్లవకారుడు. రాజద్రోహి, ఇతను చేస్తున్నది సాంఘిక విప్లవం!" అన్నారు రాజకీయవేత్తలు.

"ఇతను చెబుతున్నదంతా శాస్త్రీయంగా అసత్యం" అన్నారు వైద్యులు. "హరిజన మిఠాయి తింటే అన్నమెందుకు? హరినామ పానకం తాగితే మంచినీళ్ళెందుకు?" అని చెబుతున్నాడు భక్తాగ్రేసరుడు. "మిఠాయితింటే జబ్బు చేస్తుంది, పానకం తాగితే దాహంతీరదు, ఈ ప్రచారం ఆరోగ్యసూత్రాలకు విరుద్ధంగా ఉంది!" అన్నారు వైద్యులు.

భక్తాగ్రేసరుడు రాజద్రోహిగా, దేశద్రోహిగా నిర్ణయించబడ్డాడు. అతన్నీ అతని అనుచరులనూ కారాగృహంలో ఉంచి, ఒక రాత్రి రహస్యంగా అందర్నీ చిత్రవధ చేశారు.

ప్రభుత్వం చేసిన ఈ పనిని జనులంతా గర్హించారు. ఈ విధంగా ఒక ఊరూ పేరూ లేని ప్రభుత్వం చరిత్రలో ఒక స్థానం పొందింది.

జనులంతా భక్తాగ్రేసరుడిమీద కథలు అల్లారు. అతనికి ఒక విగ్రహం వేశారు. అతను చచ్చినరోజు పండుగ చేసుకున్నారు. అతని సంకీర్తనలన్నీ పుస్తక రూపంగా వేసి చౌకగా అమ్మి చాలా లాభాలు సంపాదించి కొందరు మేడలు కట్టుకున్నారు, అతని చరిత్ర చిత్రాలుగా తీసి లక్షలు దోచుకున్నారు.

భక్తాగ్రేసరుణ్ణి ఎట్లా ఉపయోగించుకోవాలో లోకానికి తెలిసివచ్చింది.